# బాబు

శ్రీ ఆకుండి నారాయణమూర్తి

★

నిద్రమైకంనుంచి బయటపడి తలెత్తి పైకి చూసేడు. 'ఇకముందేం చేస్తావ'న్నట్లు ప్రత్యక్షమయింది కేలండరు. భయంకరంగా కనిపించిందా తేదీ!—ముందుకు చకచకా పోతున్న కాలం తనమీద కసితీర్చుకొనే సమయం ఆసన్నమయిందనుకున్నాడు ప్రకాశం. ఇంకా ఉద్యోగం చేసేందుకతనిలో ఓపికుంది. అవసరంకూడా ఉంది. కానీ తనలోని ఓపికనూ అవసరాన్నీ గుర్తించవలిసే ఆవశ్యకత ప్రభుత్వానికి లేదని అతనికి తెలుసు!—ఏమయినా సరే ఆరోజున తనను ఉద్యోగంలోంచి ప్రభుత్వం "రిటైరు" చెయ్యక తప్పదు. ఇకముందు తనగతి?—తను తప్ప ఇంకేదిక్కూ లేని తన ఆరేళ్ళ కొడుకు భవిష్యత్తు?—ఏం చెయ్యాలో తోచని పరిస్థితిలో పడ్డాడు. ఎంత ఆలోచించినా భవిష్యత్ దారులు అగమ్యమయే యతనికి. పోనీ మరో పదేళ్లపాటయినా తనకా ఉద్యోగం ఉండిఉంటే అంతగా విచారించి ఉండేవాడు కాడు!—అప్పటికి కొద్దో గొప్పో కొడుక్కి చదువు చెప్పించి ఉండేవాడు. ఏస్థిరాస్తి లేకుండా కేవలం ఉద్యోగంమీదే ఆధారపడున్న తను, ఉద్యోగం లేకపోయిన తరువాత కనీసం స్కూలు ఫైనలు వరకైనా కొడుక్కి చెప్పించగలడా?!—ఒట్టిమాట!—పోనీ "ప్రావిడెంటు" ఫండయినా లావుగా వస్తుందా అంటే, అంతాకలసి వెయ్యిరూపాయలకు మించదు. ఆ వెయ్యిరూపాయలతోనూ ఎన్నాళ్లు కాలక్షేపం చేయడం?!—

ఆ తల్లితోపాటు వాడూ ఆ పురిటిలోనే చచ్చుంటే ఏబాధా లేకపోయేదనే కుళ్లు ఉద్దేశ్యాన్ని అతనిలో కల్పించిందా పరిస్థితి!—తనకు మరింత బాధ కల్గించడానికే వాడు బ్రతికున్నాడేమో అనుకున్నాడు ప్రకాశం!...

—కానీ మళ్ళీ బాగా ఆలోచించేడు. బ్రతికుండడమే వాడి తప్పుగా భావించకపోతే, వయస్సుమళ్లేక రెండో వివాహం చేసుకొని పిల్లణ్ని కనడం తన తప్పే అనెందుకనుకోకూడదనుకున్నాడు. కానీ ఆ రోజుల్లో అంటే, మొదటిభార్య పోయినతరువాత కొన్నాళ్లకి తనలో ఏర్పడ్డ ఉద్రేకాలవల్లా, ఇంట్లో తనకు వండిపెట్టే అందుకుకూడా ఎవ్వరూ లేకపోడంవల్లా పెళ్లిచేసుకోడం అవసరమనిపించింది!—మొదటిభార్య కూతురు రవణమ్మ 'పెళ్ళివయస్సులో చేసుకోవద్ద'ని ఎంతచెప్పినా వినకుండా ఓ శుభముహూర్తాన తాళికట్టేసేడు. పిల్లణ్ని కని తన కప్పచెప్పి హాయిగా చచ్చిపోయిందది!

కన్న మమకారాన్ని ఎలా చంపుకోడం?—వాడిని బాగుచెయ్యాలి. వాడు బ్రతికి బాగుంటే చూచి ఆనందించాలి తను!—కాని వాడు బ్రతికి బాగుండడం ఎలా?—బడిపంతులుపనయితేనేం?!—ఏదో ఉద్యోగం అంటూ ఒకటుంది గనక వాడిని అంతవరకూ అయినా పెంచగలిగేడు తను!...'ఇక ఆపైని?—గడ్డుసమస్యగా ప్రత్యక్షమయింది భవిష్యత్తు!...అంతులేని ఆలోచనలో పడ్డాడు ప్రకాశం!—

అంతట్లో వీధిగుమ్మంలోంచి కొడుకు పరిగెత్తుకొనొచ్చి—"బడికందరూ పోతున్నారు నాన్నా!—నాకు వేగిరం చల్దన్నం పెట్టు!" అన్నాడు.

"ఇవాళ్టికి నువ్వే పెట్టేసుకొని తినేయకూడదూ?" అన్నాడు ప్రకాశం చుట్ట అంటిస్తూ.

"ఆ గూడు నా కందదు నాన్నా!—ఎలా కుండ క్రిందకు దించడం?" తన చేతకానితనాన్ని వ్యక్తపరుస్తూ అన్నాడు బాబు.

ఔను! తనకు కావలసినవి సంగ్రహించుకోలేని చిన్నవయస్సులో తన కొడుకింకా ఉన్నాడు. తనమర్చిపెట్టాలి. తనే లేకపోతే ?!...అతని హృదయం త్రుళ్ళిపడింది. "సరే! పెడతాలే!—పళ్లెం కడిగి తెచ్చుకో!" అన్నాడు మంచంమీంచి క్రిందికి దిగుతూ.

"పళ్లెం ఎక్కడుంది నాన్నా!"

"వంటింట్లో మంచినీళ్ల కుదురువారుంటుంది బాబూ!" అన్నాడు.

బాబు వంటింటిలోకి పరుగెత్తేడు. కుదురు వారున్న పళ్లేన్ని పట్టుకొచ్చేడు. "ఇదుగో పళ్లెం!" అన్నాడు.

"పెరట్లోకి పోయి కడిగి తెచ్చుకొని వేసుకో!" అన్నాడు ప్రకాశం అటకదగ్గరున్న నిచ్చెన ఎక్కుతూ.

"అట కెందు కెక్కుతున్నావు నాన్నా!—నన్నూ ఎక్కించవూ?" అనడిగేడు బాబు.

"ఇంత మీదికెక్కితే కళ్లు తిరుగుతాయి తెలుసా!—పెద్దవాడివయితే ఎక్కొచ్చు." అన్నాడు.

"మరలా అయితే వెల్లుల్లిపాయలు లావుగా తియ్యి!" అని గునుస్తూ చెప్పి పెరట్లోకెళ్లిపోయేడు పళ్లెం కడుక్కొనే అందుకు.

మీదికి పోవాలనే అభిలాషతో ఉన్న బాబుని అధఃపాతాళంలో ఉంచేయడమేనా?ఎంతో ముద్దుగా పెరుగుతున్న బాబుని ఓ కష్టజీవిగా తయారు చెయ్యడమేనా? ఎందుకూ పనికిరాని వ్యక్తుల జాబితాలోకి చేర్చడమేనా?...—ఆ ఆలోచనలలో పడి బాబు కోరిన వెల్లుల్లిపాయలు తియ్యడం మరచిపోయి ఒట్టి ఆవకాయమాత్రం పట్టుకొని దిగిపోయేడు ప్రకాశం.

అప్పటికింకా బాబు పళ్లెం పట్టుకొనిరాలేదు. ఇంకా ఎంచేత రాలేదా అని పెరట్లోకి వెళ్లేడు ప్రకాశం. బాబు నూతిదగ్గర నిలబడి లోపలకి చూస్తున్నాడు.

"ఏం బాబూ అలా నిలబడ్డావు?"—అనడిగేడు ప్రకాశం.

"గోలెంలో నీళ్లు లేవు నాన్నా. నూతిలో ఉన్నాయి. నే తోడలేను."

అట్టడుగున ఉన్న వాటిని బైటికి తీసుకొనే అంతటి శక్తి బాబుకు వచ్చేవరకూ తను పెంచాలి. ఎలా?—నీళ్లు తోడేడు. తనే పళ్లెం కడిగేడు. "రా లోపలకి." అన్నాడు.

పీటవేసి పళ్లెం వేసేడు. ఉప్పూ వామూ వేసేడు. చల్దిగూడు దగ్గరకెళ్లి కుండదింపేడు. అన్నం వడ్డించబోతూఉంటే అందులో ప్రత్యక్షమయింది చచ్చిపోయిన సాలెపురుగు!—"నయం!—గ్రుడ్డిగా వడ్డించేసేను కాదు. లేకపోతే......" అని తండ్రి అంటూ ఉండగానే కొడుకు అందుకొని—

—"ఏం నాన్నా?!" అనడిగేడు ఆశ్చర్యంతో.

"చూసేవా సాలెపురుగు?!—మహా విషం!—లే!—ఇవాళ్టికి హోటల్లో టిఫీను తిందువుగాని." అన్నాడు.

ఆకల్తో ఉన్న బాబు అన్నం తినకుండానే లేచిపోయేడు. కానీ ఆ ఆకలిబాధ హోటలు కెళతాం కదా అనే సరదాలో కొంత లోపించింది.

తండ్రి పొందుతున్న మనోవ్యాకులత బాబుకేం తెలుసు?!—ఆ దిన ప్రారంభంలోనే ఓ అపశకునం!—తనొడ్డించబట్టిగానీ, బాబే ఆ అన్నం పెట్టేసుకొనుంటే ఏమయ్యుండేవాడు?!—వచ్చే ప్రమాదాన్ని గుర్తించలేనంతటి చిన్నవయుస్సు. ఉద్యోగం లేకపోతేనేం?—ఇంకా తను బాబుకోసం ఎలా అయినా బ్రతికుండాలనుకున్నాడు.

చినిగిన లాల్చీ తొడుక్కున్నాడు ప్రకాశం. ఆ తొడగడంలో మరింత చిరిగిపోయిందా లాల్చీ!—బాబా సంగతి చూసేడు. "నాన్నా! నడ్డిమీద బాగా చిరిగిపోయింది చొక్కా!—కుట్టించకూడదూ?" అనన్నాడు.

"అలాగే!" అని మాత్రం అన్నాడు బాబుతో!—ఇంకొన్నాళ్లలో లాల్చీలు చిరగడం, వాటిని కుట్టించడం అనే బాధే ఉండదు. లాల్చీ అంటూ ఓటున్నప్పుడు కదా అది చిరగడం, దాని కతుకు లేయించి కుట్టించడం ఆ బాధంతాను!...అప్పుడు జీవితంలో బాహ్యంగా కనిపించని ఓ చిరుగు మాత్రం ఉంటుందనుకున్నాడు.

బాబు పుస్తకాలు సర్దుకోడం పూర్తయింది. గుమ్మం దగ్గరకొచ్చేడు. మళ్ళీ వెనక్కు తిరిగి తాళాల కోసం వెతుకుతున్న తండ్రిదగ్గరకొచ్చి—"నాన్నా

ఈ ఏడాది పాసయితే మళ్ళీ ఏడాది నీ క్లాసుకొస్తాను కదూ?" అనడిగేడు.

ఏమని సమాధాన మివ్వాల్లో అర్థంకాలేదు ప్రకాశానికి. "సరేగానీ, తాళాలు కనిపించడంలేదు. మంచంక్రింద పడిపోయేఏవెూ చూడు." అన్నాడు.

బాబు మంచంక్రిందకి దూరేడు. "ఇవుగో నాన్నా!" అని అంటూ తాళాలను గలగలా ఆడిస్తూ బయటకు వచ్చేడు.

—ఏదో పెద్ద ఘనకార్యం సాధించినవాడిలా తాళాలు పట్టుకొని ఘనంగా నిలబడ్డ బాబు ముఖం లోకి చూసేడు ప్రకాశం. అతని కళ్ళల్లో నీళ్లు తిరిగేయి. "పద స్కూలుకి పోదాం." అన్నాడు గిరుక్కున వెనక్కు తిరిగి.

తలుపులు వేస్తూఉన్నప్పుడు తలంపు కొచ్చిందా తేదీ!—కేలండరువేపు చూసేడు. తనవేపు చూసి వెత్తిగా వెక్కిరించినట్లుగుపడిందా తేదీ!—అటు మరి చూడలేకపోయేడు. తలుపులేసి తాళం వేసేసినా తలంపులోంచిపోలేదా తేదీ!—బయలుదేరేడు.

గొడుగవసరం అంతగా అప్పట్లో లేదుగానీ, చినుకులుమాత్రం కొంచెం పడుతున్నాయి. క్రింద బురదా; మీదనుంచి చిటచిటమని చినుకులూ!—బాధగాఉన్నా భరిస్తూ ముందు కడుగులు వేస్తున్నారా తండ్రీ కొడుకు లిద్దరూ.

బడికిబోయే విద్యార్థుల సంఖ్య చాలా పలచగా ఉండడంచేత—అప్పటికప్పుడే బడివేళయి పోయుంటుందని ఊహించేడు ప్రకాశం.

"నాన్నా ఇవాళ బడికి మనం ఆలస్యంగా వెళుతున్నాంకదూ?" అనడిగేడు బాబు.

'ఔను!—నిన్న కనడంకూడా ఆలస్యంగానే జరిగిం దండామనుకున్నాడు. బాబుతో అలా అనడం తెలివితక్కువతన మనిపించి—"పద గబగబా!" అని మాత్రం అన్నాడు. చిన్న చిన్న అంగలేసుకుంటూ బాబు తండ్రితో సమానంగా పోతున్నాడు.

అప్పుడు సరిగ్గా ఆఊళ్లో క్రొత్తగా పెట్టిన హైస్కూలుప్రక్కనుంచి పోతున్నారు. సరిగ్గా హైస్కూలు గేటుదగ్గర కొచ్చేసరికి బాబు తమాషా అయిన ప్రశ్న అడిగేడు. "ఈ పెద్దబడిలో నన్నెప్పుడు చదివిస్తావునాన్నా?" అని.

"నువ్వు చక్కా అయిదోక్లాసు పాసయితే అప్పుడు!" అన్నాడు తండ్రి.

"అప్పుడు మరి నువ్వూ ఈబడిలోకే పనిచెయ్యడానికొస్తావా?!" అనడిగేడు తండ్రిముఖంలోకి చూస్తూ.

బాబు అమాయకంగా అడిగిన ఆ ప్రశ్న అతనిలో కల్లోలాన్ని రేపింది. తన జీవితంలో ఉద్యోగపర్వం ఆదినంతో సమాప్త మవుతున్నట్లు బాబుకేం తెలుసనుకున్నాడు. లోకం అంటే ఏమిటో తెలీని బాబు ఎన్నెన్నో ఊహల్ని సృష్టించుకుంటున్నాడు. వయస్సు హెచ్చవుతున్నకొద్దీ ఊహించిన ఒక్కొక్క ఊహ ఊహించలేనంతటి క్రిందికి పడిపోతున్నప్పుడు బాబుహృదయం ఎలా బాధపడుతుందో!—ఊహించడానికి భయం వేసింది ప్రకాశానికి. భవిష్యత్తు భయంకరంగా ప్రత్యక్షమయింది.

స్కూలు దగ్గిర పడింది. "నాన్నా కాఫీ హోటలుకి వెళదాం అన్నావు?" అన్నాడు బాబు.

"అయ్యో! — నామతి మండా! — మరిచిపోయేను—" అని మళ్ళీ వెనక్కు తిరిగి "విశ్వేశ్వర" హోటలులోకి తీసుకెళ్లేడు బాబుని. జేబులు తడువుకున్నాడు. ఫరవాలేదు. నిబ్బరంగా దినగలిగినంత టిఫిన్ తిన్నా రిద్దరూ. బిల్లు చెల్లించి బయటపడ్డా రిద్దరూ—

పాఠశాల ఆవరణలోకి అడుగు పెట్టే రిద్దరూ!—మెట్లెక్కుతూ ఉంటే కాళ్లు తడబడ్డాయి ప్రకాశానికి. వణుకుతూఉన్న కంఠంతో బాబుతో అన్నాడు. "నాయనా నీక్లాసుకి నువ్వెళ్లిపో!" అని. బాబెళిపోయేడు.

సంతకం పెట్టడానికని హెడ్మాష్టరి గదిలోకి వెళ్లేడు ప్రకాశం.

"ఏంమాష్టారూ!—ఇవాళ ఇంత ఆలస్యంగా వచ్చేరు. ఎలాగూ ఈబడితో ఇక సంబంధం దీరిపోతుందనా?" అనడిగేడు హెడ్మాష్టరు.

"అబ్బే!—లేవడం కొంచెం ఆలస్యంఅయింది"

"సరే!—సంతకంపెట్టి క్లాసులోకి వెళ్లండి. ఆఖరు పిరియడుఅయేక రిటైరు చేసేస్తాను. మధ్యాహ్నం స్కూలు లేదుగా మరి!" అన్నాడు.

చాలా కఠోరంగా వినిపించాయా మాటలు ప్రకాశానికి. కానీ ఏంచేస్తాడు ? ఆవిషయంలో ఆ హెడ్మాష్టరు చేసే నేరం ఏముంది?—అతని విధి అతను నిర్వహించుకుంటున్నాడు. సంతకం చెయ్యడానికి పెన్ను తీసేడు. చెయ్యి ఒణికింది. ఏదో గొలికీసేడు.

క్లాసులోకి వెళ్ళేడన్న మాటేగానీ ప్రకాశం మనస్సు మనస్సులో లేదు. ఒకటో గంట వినిపించింది. అతని గుండె జల్లుమంది. మరి గంటలు కొట్టకుండా ఉన్నా బాగుండు ననిపించింది. కానీ అవాళ కాలం చాలా వేగంగా పయనిస్తున్నట్లనిపించింది ప్రకాశానికి.

రెండూ, మూడూ గంటలుకూడా పూర్తయేయి. ఆఖరిగంట సమీపించింది. ఆవేద నెక్కువయింది ప్రకాశంలో!—అదీ పూర్తయింది. తడబడుతున్న అడుగులతో హెడ్మాష్టరుగదిలోకి ప్రవేశించేడు.

అప్పటికప్పుడే సంతకం మినహా తక్కిన తంతంతా పూర్తిచేసేసుంచీసేడు ప్రకాశాన్ని రిటైరు చెయ్యడానికి.

“మిమ్మల్ని రిటైరు చెయ్యడం చాలా బాధగా ఉంది. ఈ పాపిష్టి చేతులతో చేస్తున్నా! — ఏం చెయ్యడం మరి!” అని సానుభూతి తెలియజేసేడు.

మిగతా సహోపాధ్యాయులుకూడా తమతమ సానుభూతుల్ని తెలియజేసేరు.

“మీరింకా ఈ ఊళ్లోనే ఉంటారు కదూ? చెక్కొచ్చినవెంటనే కబురంపిస్తాను. ఈనెల ఇంత వరకూ రావలసిన జీతాన్ని తీసుకుందురుగాని!” అన్నాడు హెడ్మాష్టరు. ప్రకాశం సంతకం చేసేడు. ఇక అయిపోయింది ఉద్యోగం ఆనాటితో!—

“వస్తా, ఇంకా ఇంటికి పోయి వంటచేసుకోవాలి. దయ ఉంచండి. ఏదో ఇన్నాళ్లూ నన్నెంతో అభిమానంతో చూసేరు. అందుకు నా కృతజ్ఞతా పూర్వక అభివందనాలు” అని కుర్చీలోంచి లేచేడు. మిగతా సహోపాధ్యాయులందరికీ వందనాలర్పించి ఆఫీసు గదిని దాటేడు. గేటుదగ్గర తనకోసం కాచుకూర్చున్న బాబుని కలసేడు.

“అంతసేపటి క్రిందట గంట కొడితే, ఇప్పటి వరకూ ఏంచేస్తున్నావు నాన్నా?—” అనడిగేడు.

“ఏంలేదు బాబూ! — హెడ్మాష్టరిగారితో మాట్లాడుతున్నా” అన్నాడు.

ఆకలిబాధ ఎక్కువగా ఉందేమో దారిలో మరి బాబేం మాట్లాడలేదు. మాట్లాడే పరిస్థితిలో లేడు ప్రకాశం. ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు.

బాబు కొంతసేపు ఇటూ అటూ తిరిగి ఎక్కాల బుక్కు తీసేడు.

ప్రకాశం నడుం వాల్చేడు బల్ల మంచంమీద. కొంతసేపయినా ప్రపంచాన్ని మరచి నిద్రపోదామని అతని ప్రయత్నం. కానీ భయంకరమయిన లోకంలో కంటకావృతమయిన భవిష్యత్ దారులు ప్రత్యక్షమయేయి. నిద్ర పట్టలేదు.

అంతట్లో అకస్మాత్తుగా అనుకోకుండా ఒచ్చిపడిందో వైరు మొదటిభార్య కూతురయిన రవణమ్మ దగ్గరనుంచి!—భర్తకు చాలా సుస్తీగా ఉన్నట్లూ వెంటనే బయలుదేరిరమ్మనమని. ప్రశాంతంగా జీవితం గడుపుతున్న కూతురి సంసారంలో ఒచ్చిపడ్డ విపత్తు అతనికి మరింత బాధ కలిగించింది.

ప్రకాశం రెండో వివాహం చేసుకున్నాక రవణమ్మ ఓసారయినా రాలేదు సరికదా, రెండు త్తరాలు తప్పిస్తే మరి రాయలేదు తనెన్నిసార్లు రాసినప్పటికీ!—పెళ్ళికి రాలేకపోయినందుకోటీ; సవతితల్లి చచ్చిపోయేక సానుభూతి ఉత్తరం ఓటిన్నూ!

తను రెండో వివాహం చేసుకున్నాక కష్టకట్టి ఒక్కమారయినా, కూతురు రాకపోయినప్పటికీ ఆకష్ట సమయంలో తను వెళ్లక తప్ప దనుకున్నాడు భర్త తరఫున ఆమె కెవ్వరూ లేనేలేరు. ఇక ఆమెకు మిగిలిన ఆత్మీయుడు తనొక్కడే!— మొదటి భార్య కూతురు; రెండో భార్య కొడుకూ అనే భేదం మినహా ఇస్తే ఇద్దరూ తనకొక్కలాంటి ఆప్తులే! — ఎవరిని తను ద్వేషించడం?—

కానీ విశేషం ఏమిటే అంటే, తను పునర్వివాహం చేసుకోడంవల్ల కూతురిదృష్టిలో తను నేరస్తుడయిపోయేడు! — ఏదో ఆమె అదృష్టం బాగుండి బాగా డబ్బున్న భర్త లభ్యం అవడంవల్ల, కాస్త గర్వం అహంభావం హెచ్చయాయి. పైగా అత్తగారివంక వాళ్లెవరూ అడ్డుగా లేరు! — అదే ఏ బీదకొంపలో నయినా ఉంటూఉన్నట్లయితే ఇంతగా తనను ద్వేషించుండేది కాదేమో ననుకున్నాడు. ఓ సంబంధంవల్ల తనంటే ఆమె కభిమానం, ఇంకో సంబంధంవల్ల తనంటే జుగుప్సా ఆమెలో ఏర్పడ్డా యనుకున్నాడు.

మొత్తానికెలా అయితేనేం, కూతురికి తనమీద ఏరకంభావం ఉన్నప్పటికీ ఆసమయంలో తనెళ్లక తప్పదనుకున్నాడు. “బాబూ! ఇలారా!—” అని పిలిచేడు.

బాబొచ్చేడు. “చూడు నాయనా! — నీబట్ట లెక్కడెక్కడున్నాయో నెతికి తీసుకురా! — అక్కయ్యగారూరు వెళదాం!” అన్నాడు ప్రకాశం.

“‘అక్కయ్యా, అక్కయ్యా’ అని అంటూ ఉంటావుకదా, అక్కయ్య ఎలాగుంటుంది నాన్నా!_

కిష్టిగాడూ వాళ్ళ అక్కయ్యలా గుంటుందేంటి?" అనడిగేడు.

"కిష్టిగాడూ వాళ్ళ అక్కయ్యకన్నా చాలా పెద్దది. నీఅంత కొడుకుకూడా ఉన్నాడక్కయ్యకి. చక్కా నువ్వూ వాడూ ఆడుకోవొచ్చు!"

"అయితే వెళదాం నాన్నా! — రైలుమీదా, బస్సుమీదా?"

"రైలుమీదే వెళ్ళాలి. చాలాదూరం వాళ్ళూరు!"

"నేరైలు ఒక్కమారూ ఎక్కలేదు. వెళదాం నాన్నా. అయితే నాన్నా! ... అక్కయ్య మనూరు ఓమారూ రాలేదేం?"

ఏమని సమాధానం ఇవ్వడం?! — బాబే లేక పోయుంటే ఒప్పుండేదేమో! — "మరి వాళ్ళూరు చాలాదూరంకదూ! — అందుకు!" అని సమాధాన మిచ్చేడు.

"మరయితే కిష్టిగాడక్కయ్య ఎప్పుడూ వస్తూ ఉంటుందేం?!"

బాబుగాడడిగే ప్రశ్నలు విసుగునీ దుఃఖాన్నీ ప్రకాశానికి కలుగజేసేయి. అందుకు మరి సమాధాన మివ్వలేదు. "సరేగానీ, ముందు నీ బట్టలన్నీ వెతికి తీసుకురా. పెట్టెలో సర్దుతాను." అన్నాడు.

"అయితే మనం అక్కడెన్నాళ్ళుంటాం నాన్నా?"

"బావకి జబ్బుగా ఉందిట!—అది తగ్గిపోయేక వచ్చేస్తాం మళ్ళీ!"

"బావెలా ఉంటాడు నాన్నా?"

"బాగుంటాడు!—వెళ్తున్నాంగా!—చూద్దువు గాని. మొదట నీ బట్టలన్నీ వెతికి తీసుకురా?" అన్నాడు పెట్టె తెరుస్తూ.

బాబు పరుపుదగ్గరకెళ్ళేడు. అందుమీదున్న తన రెండు చొక్కాలూ పట్టుకొచ్చేడు. "మిగిలినవి దండెంమీదున్నాయి. నా కందవవి!" అన్నాడు.

"సరే!—నీ పుస్తకాలన్నీ సర్ది పట్రా; అక్కడున్నన్నాళ్ళూ చదువుకుందువుగాని?" అన్నాడు.

కొంతసేపయింది. సర్దడం పూర్తయింది. పర్సు తెరచి చూసేడు. నలభైఒక్కరూపాయీ నాలుగణాల అర్ధణా ఉంది. ఆ నెలజీతం, ప్రోవిడెంటు ఫండూ ఒచ్చేవరకూ అతనికున్న ఆస్తంతా అదే! — ఎలా కాలక్షేపం చెయ్యడమో అర్థంకాలేదతనికి!—

దారి ఖర్చులు మినహాఇస్తే కూతురింట్లో తనకి భోజనపుఖర్చుండదు. ఇక తన చుట్టలకిమాత్రం కొంత ఖర్చవుతుంది. అంతే!—తిరిగొచ్చేటప్పుడు కూతురు దారిఖర్చులకయినా డబ్బివ్వదా ఏమిటి?! — కానీ ముందుముందు ?? ఆ విషయంగురించి ఆలోచిస్తూ ఉండగా — "నాన్నా! — మనం అన్నం తినేసి బయలుదేరుదామా, తినకుండా బయలుదేరుదామా?" అనడిగేడు బాబు.

"తినీసే బయలుదేరుదాం. రైలులో రెండు రోజులపాటు ప్రయాణం చెయ్యాలి మనం."

"అయితే రైలులో మన కాకలేస్తేనో!"

"ఏదో ఫలహారం కొనుక్కు తిందాం!"

"అక్కడ అమ్మతాయేంటి నాన్నా?"

"ఓ!—నీక్కావలసినన్ని కొంటాను" అంటూ వంటింటిలోకెళ్ళేడు పొయ్యి రాజేసేందుకు.

అన్నం వండేడు. తిన్నారిద్దరూ. కూలివాడిని మాట్లాడేడు. సామాను వాడి నెత్తిమీద కెక్కించేడు. కేలండరువేపు చూడకుండానే తలుపువేసి తాళం వేసేసేడు. బయలుదేరేరిద్దరూ!

## 2

వీధి మలుపు తిరిగేసరికి అల్లుడి ఇల్లు ఓ ఫర్లాంగు దూరంలో కనిపించింది. గుమ్మంముందు కొంతమంది జనం మూగుండడంచేత ప్రకాశంలో ఆందోళన హెచ్చయింది.

"ఇంకా చాలాదూరం ఉందికదూ అక్కయ్య గారిల్లు?!" అనడిగేడు బాబు. అలా అడగడంలో బాబుద్దేశ్యం ఏమిటీ అంటే, అలా ఇంకా చాలా దూరం అక్కయ్యగారిల్లు ఉంటే, చాలాసేపు సరదాగా రిక్షాలో కూర్చోవచ్చుకదా అని! — కానీ బాబు సరదా మాయమయిపోయేటట్టు — "ఇదుగో వచ్చేసేం!—ఇంకెంతో దూరంలేదు. ఆ మనుష్యులు మూగున్నారే అక్కడే!" అని సమాధాన మిచ్చేడు ప్రకాశం.

రిక్షా ఆ ఇంటిదగ్గరకు చేరుతున్నకొద్దీ ప్రకాశంలో ఆందోళన హెచ్చుకావడం మొదలెట్టింది.

బాబులోనూ ఆందోళన లేచింది—"అమ్మో!- ఇంత వేగిరం రిక్షా దిగిపోడమేనా?" అని.

ఇంటిముందు రిక్షా ఆగింది. తండ్రీ కొడుకు లిద్దరూ దిగేరు. రిక్షాలోంచి సామాను దించడం,

లోపల మంచంమీంచి శవాన్ని దించడం ఒక్కమారే జరిగింది. ఘొల్లున ఏడుపులు వినిపించేయి. ప్రకాశం లోనకు పరిగెట్టేడు. ఇంకేం ఉంది?!—పూర్తిగా దించేసేరు క్రిందకి!—

గుండెలు బాదుకుంటూ బావురుమని ఏడుస్తున్న కూతురిముఖంలోకి కన్నీరు కారుస్తూ చూసేడు ప్రకాశం.

“నాన్నా!-అంతా అయిపోయేక వచ్చేవా?!” అంటూ భర్త గుండెలమీద ముఖంపెట్టి కన్నీళ్ళు కార్చింది కూతురు.

—“ఇంక నాకెవరు దిక్కు నాన్నా!—ఈ చంటివాడిని చూడు నాన్నా!—ఇంక వీడు “నాన్నా” అని ఎవళ్లని పిలుస్తాడు?—అయ్యో నాయినా! ఎంత పనయింది నాయినా!....... ..” ఆమె ఏడుపుకి మరి ఆనకట్టు లేదు. అదే ధోరణి!—

“ఇంత చిన్న వయస్సులోనే......ఇంతకీ ఇదంతా మన దురదృష్టం!—ఆ భగవంతుడు......” పూర్తిచెయ్యలేక పోయేడా వాక్యాన్ని. కన్నీళ్ళద్దుకున్నాడు. “ఆఖరిసారిగా అల్లుడితో మాట్లాడలేక పోయేను. ఇలా అవుతుందని అనుకోలేదమ్మా!—ఈ ప్రపంచంలో......” ఇంకా ఆ వాక్యం పూర్తవకుండానే వెనకను నిలబడున్న బాబు—“నాన్నా! నాకిక్కడ భయంగా ఉంది. మనం వేగిరం పోదాం రా నాన్నా!” అన్నాడు.

రవణమ్మ బాబువేపు తలెత్తి చూసింది. దుఃఖంలో దుఃఖం కలిసిపోయింది!!!

తండ్రిని ఏదో అడుగుదామని బాబు నోరు తెరచేడు. కానీ అంతమంది మధ్య ఆ వాతావరణంలో అడగడానికి భయపడ్డాడు. ఈ అనంతమయిన జగత్తులో చావుపుట్టుకల ఆంతర్యం, మనిషికీ మనిషికీ గల సంబంధాల సన్నిహితత్వం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో తెలీని బాబుకా పరిస్థితంతా భయానకమయింది. ఇంకా అక్కడట్టే కాలం ఉంటే ఏం ప్రమాదమొస్తుందో అని భయం వేసింది!—కానీ తండ్రి తన భయాన్ని తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్నాడని బాబు గుర్తించేడు. తండ్రి కళ్లంట నీళ్లు కారుస్తూ ఏడ్వడం చూసి తనూ బావురుమన్నాడు. ఎందుకేడవాలో బాబు కంతగా బోధపడలేదు గానీ తండ్రి ఏడుస్తున్నాడు గనక, అసలు ఆ దృశ్యమంతా ఏడుపుల మయమయుంది గనక తనూ ఏడ్చేసేడు!—

పచ్చబద్దల పల్లకీ తయారయింది. కర్మకాండ పూర్తయింది. రవణమ్మ తెలివి తప్పిపోయింది. అదే సమయమని శవాన్ని భుజాల కెత్తుకున్నారు మోతగాండ్రు.

రవణమ్మకు తెలివొచ్చేసరికి భర్తశవం మరక్కడ లేదు. బాబు మాత్రం కళ్లెదుట పడ్డాడు. ఆ ప్రక్క నిలబడున్నాడామె కొడుకు నానిగాడు. “నాన్న నెక్కడికి తీసుకెళిపోతున్నారు?”ని నాని ఏడుస్తూ అడిగేడు బాబుని. కొడుకడిగిన ఆ ప్రశ్న విని మళ్ళీ తెలివి తప్పిపోయింది రవణమ్మ.

## 3

పన్నెండు రోజులూ గడిచేయి!—“ఇంక నే వెళిపోతానమ్మా!” అన్నాడు ప్రకాశం కూతురితో

“ఎక్కడికి నాన్నా?” అనడిగింది రవణమ్మ.

ఎక్కడికా అనే సంశయం ప్రకాశానికి కలిగింది. ఎక్కడికెళిపోతే మాత్రం తనకేముంది గనక!—ఉద్యోగమా ఏమన్నానా?!—

—ప్రకాశం ఇంకా ఏ సమాధానం ఇవ్వకముందే—“నీకక్కడ ఉద్యోగం అయిపోయిందిగా!” అంది.

“ఔను!— అక్కడి పని పూర్తయింది. కానీ—”

“మరయితే అక్కడి కెందుకూ?!”

“ఏఁవీ లేదూ; ఏవయినా ప్రయివేట్లు చెప్పుకొని జీవితం గడపొచ్చు కదా అని!—”

“ఆ బాధంతా ఎందుకు?—ఇంక నాకెవరున్నారు గనక!—ఇక్కడే ఉండిపో నాన్నా. ఈ పసివాడితో ఏ మొగదిక్కూ లేకుండా ఒక్క ఆడదాన్ని ఎలా బ్రతకడం చెప్పు?” అని కొడుకు నానిగాడి తలమీద నిమురుతూ కన్నీరు కార్చింది రవణమ్మ.

అదీ నిజమే అనుకున్నాడు ప్రకాశం. అల్లుడు బ్రతికున్నట్లయితే తన అవసరం కూతురి కంతగా లేకపోయేది. అశక్తి పరసహాయాన్ని ఆశిస్తుంది!—ఆకారణంచేతే కూతురు తనని ఉండిపొమ్మంటున్నాదనుకున్నాడు!—మరే ఇతర ఆస్కారం జీవనోపాధికి లేని తండ్రిని అలా చూస్తూ పొమ్మనే అందుకు ప్రేమానుబంధం ఆటంకమవడంవల్ల అలా ఉండి

పొమ్మందని ఎందు కనుకోకూడదని కూడా అనుకున్నాడు.

మొత్తానికే ఉద్దేశ్యంతో ఉండిపొమ్మన్నప్పటికీ, అక్కడ తను శాశ్వతంగా తిష్టవెయ్యడంవల్ల ఏవయినా వికృత సమస్యలు ఉత్పన్న మవుతాయేమో అనే భయం వేసిం దతనికి. తనొక్కడూ ఉండిపోయినట్లయితే ఏ వికృతసమస్యలూ ఉత్పన్నం కావు!—కానీ తనతోపాటు బాబుకూడా ఉండిపోయినప్పుడే గొడవ!—ఎలా?!—బాబు నెక్కడ ఉంచడం?—తనతోపాటే బాబుండాలి!—అయితే ఎక్కడుండడం?—ఎవ్వరికీ బాధ కలగనిచోట!—ఆ చోటెక్కడ?—అర్థమయింది కాదు ప్రకాశానికి!...

"ఇంతగా ఆలోచించాలా నాన్నా!—అక్కడ నువ్వు లేకపోతే మన ఇళ్ళూ వాకిళ్ళూ భూములూ పోతాయని భయమా?—ఇంతకీ నిన్నుండిపొమ్మంటున్నది నీ కూతురు!—మరేం పరాయిది కాదు!—ఆయన శాశ్వతంగా వెళ్ళిపోయేరు. నువ్వు బ్రతికుండీ కూడా నాకు దూరంగా వెళిపోతావా నాన్నా" అని బావురు మంది రవణమ్మ.

"అలాగే లే అమ్మా!—ఉంటాను!" అన్నాడు ప్రకాశం బరువుగా ఓ నిట్టూర్పు విడుస్తూ.

"తాతయ్యా!—నువ్వు చక్కా ఇక్కడే ఉండిపోతావుకదూ!—మరి వెళ్ళకేం?! మరి నాన్న రాలేదు చూడు." అన్నా డమాయకంగా మనుమడు నానిగాడు.

"నాయినా!" అనంటూ నానిగాడిని ఎత్తుకుంటూ కన్నీరు కార్చేడు ప్రకాశం. రవణమ్మ కొంగుతో కన్నీళ్లద్దుకొంది.

"అయితే నాన్నా!—మనం మరి మనూరు పోమూ?" అని ఆందోళనతో అడిగేడు బాబు. ఎంచేతో అక్కడుండడం బాధనిపించింది బాబుకి. వచ్చినదగ్గరనుంచీ ఏడుపులూ మొత్తులతోనే నిండిపోయుందా ఇల్లు. ఇక అక్కయ్య తనను చేరదీసి ఆదరించడం లేనేలేదు. పైగా తండ్రి కూడా అదోలా గున్నాడు. అదంతా ఓ అసహ్యకరమయిన వాతావరణంగా అగుపించింది బాబుకి. అక్కడుండడం చాలా బాధనిపించింది. ఎంతవేగిరం అక్కణ్ణుంచిపోతే అంతబాగుండు ననిపించింది బాబుకి!—

—బాబలావచ్చినదగ్గరనుంచీ 'పోదాం పోదాం' అని అంటూఉండడం వింటూనే ఉంది రవణమ్మ. ఆమెకు ఓప్రక్కనుంచి కోపం, మరోప్రక్కనుంచి దుఃఖంకూడా వచ్చేయి!—ఆ పోయేవాడు ఆతల్లితో పాటేపోయుంటే బాగుండిపోయే దనుకుంది!—"ఎక్కడికిరా పోతవు?!—వచ్చిన దగ్గరనుంచీ "పోదాంనాన్నా!" అంటూ ఒకటే గొడవ!" అని గట్టిగా కసిరినట్టుంది రవణమ్మ.

రవణమ్మ అలా అనడంతోనే బాబు భయంతో అదోలా ముఖం పెట్టేసేడు. పైకి ఏడవలేదుగానీ లోపల్లోపల ఏడ్చేడు!—

"వీడి నెలా చూస్తావో మరి!—తల్లీ తండ్రీ నేనేఅయి ఇంతవరకూ పెంచేను. ఆఖరికి వీడివల్ల నాకు దుఃఖమే మిగులుతుందో, సంతోషమే మిగులుతుందో!—ఆబాధ్యత నీలోనే ఉంది." అన్నాడు ప్రకాశం బాబుని ముందుకి తీసుకొని తలమీద నిమురుతూ.

రవణమ్మ ఆవిషయమై మరేమీ అనలేదు. మాటలు మారుస్తూ—"నాన్నా!—ఈ నానిగాడు ఒక్కపిసరయినా చదవకుండా ఉన్నాడు. వీడికి చదువుమీదశ్రద్ధ కలిగించే పూచీ నీదే!" అంది.

"చిన్నపిల్లడుకదమ్మా మరి!—ఒక్క నెల రోజులలో మీ తమ్ముడితో సమానంగా చదివేస్తాడు!—ఏరా నానీ!" అన్నాడు.

"వాడికన్నా నాకే బాగా ఒచ్చు తాతయ్యా!" అన్నాడు నానిగాడు ఒక్కగంతేసి తాతయ్యదగ్గరకొచ్చి.

"ఆఁ!—నేను రెండో క్లాసు పుస్తకం చదివేస్తా!—ఏంనాన్నా?!" అన్నాడు బాబు తన ఘనతను వ్యక్తంచేస్తూ.

బాబలా అనేసరికి రవణమ్మకు కొంచెం ఉడుకుమోత్తనం కలిగింది. తనకొడుకూ, సవితితమ్ముడూ ఒకే వయస్సువాళ్ళని ఆమెకు తెలుసు!—అయినా బాబుగాడు తన కొడుకుకంటే తెలివి తేటలతో ఉన్నాడు. వాడు తన స్వయం తమ్ముడే అయున్నట్లయితే ఆమెలో ఆరకమయిన ఈర్ష్యకు తావుండేది కాదు. కానీ సంబంధం దూరం అయింది. సవతితల్లి కొడుకయిపోయేడు బాబు! వాడు బాగుంటే చూసి ఆనందించడం ఎలా?—

"చూస్తూఉండు ఒక్క నెలరోజుల్లో నీకన్నా వాడు బాగా చదవగలుస్తాడు." అంది రవణమ్మ.

"నేనూ ఈలోగా మరికొన్ని క్రొత్తవి నేరుస్తాను." అని గొణిగేడు బాబు.

"ఒరేయిబాబూ! — నువ్వు మీ ఊళ్లో ఎప్పుడయినా సర్కస్సు చూసేవా మరి; ఇన్ని కబుర్లు చెప్తున్నావుకదా!" అనడిగేడు నానిగాడు.

"చూడు నానీ! — వాడు నీ కేమవుతాడో తెలుసా? — మామయ్య అవుతాడు. ఇకనుంచీ 'మామయ్యా' అని పిలువు." అన్నాడు ప్రకాశం నానిగాడితో.

"మరయితే వాడు నన్ను 'నానీ' అని పిలవొచ్చేమిటి?" అని గొణిగేడు నానిగాడు.

"ఇంతకీ ఎలాగో ఓలా పిలుచుకోనిద్దూ నాన్నా! — ఎలా పిలుస్తే నేం?" అని అక్కణ్ణుంచి వంటింటిలోకి వెళిపోయింది రమణమ్మ.

బాబుగాడిని "మామయ్యా!" అని పిలవమని నానిగాడితో తను చెప్పినప్పుడు కూతురిముఖం అదోలాగుండడం చేత, మనస్సులో ఏదో ఆమెబాధపడుతున్నాదని ఊహించేడు ప్రకాశం. బాబుమీద అభిమానం ఆమెకు రవ్వంతయినా లేదేమో అనే అనుమానం వేసిందతనికి. ఔను మరి! — సవతితల్లి కొడుకు మీదభిమానం ఎలాగుంటుం దనుకున్నాడు.

"ఒద్దు, ఒద్ద"ని కూతు రెంతచెప్పినా వినకుండా రెండో పెళ్ళి చేసుకున్నాడు తను! — చేసుకున్నందుకు అనుభవించాలి మరి! — ఇంకా నయం! — అది కూడా బ్రతికున్నట్లయితే తను పెళ్ళాంతోసహా బాబుని పెట్టుకొని ఎలా బ్రతుకగలుస్తాడు? అది చచ్చిపోడంకూడా ఒకందుకు మంచిదేమో అనుకున్నాడు! — పైగా అల్లుడు కూడా చచ్చిపోడం ఓరకంగా తన మంచికే ఏమోనని అనుకున్నాడు. అల్లుడే బ్రతికున్నట్లయితే తనను ఉండిపొమ్మని కూతు రంటుందా అసలు! — అలా ఇంట్లో ఉండిపొమ్మని పట్టు పడుతుందా? — అప్పుడు తనేంచేసేవాడు — బాబునెలా పోషించగలిగేవాడు? — ఏదో అల్లుడు చచ్చిపోబట్టి, ఆమెకు మరే మొగదిక్కూ లేకపోబట్టి ఉండిపొమ్మంది! — తిండిగుఱించిక దేవులాడ నక్కర్లే దనుకున్నాడు. ఎంతిదయినా రవణమ్మకి తను తండ్రవుతాడు. కూతురిదృష్టిలో తనెంత నేరస్థుడయినప్పటికీ తిండి పెట్టకుండా తగిలీదు! — తనముఖంచూసి బాబుని కూడా పోషిస్తుంది. తను చచ్చిపోయేక ఏమో?! — తన చావు సంగతి జ్ఞాపకాని కొచ్చేసరికి ప్రకాశానికి ముచ్చెమటలూ పోసేయి. బాబుసంగ తేమిట నే భయంకరసమస్య ఎదురయిం దతనికి. ఆలోచించడానికి భయం వేసింది! — అంతా "భగవత్కృప" అనే సిద్ధాంతంలో కొచ్చేసే డాఖరికి.

## 4

"చూడు నాన్నా! — నానిగాడికి అక్కయ్య అణా ఇచ్చింది. వాడు పకోడీలు కొనుక్కొని తిన్నాడు. నా కిమ్మంటే ఇచ్చేడు కాడు. నివ్వయ్య నాన్నా!" అనడిగేడు బాబు ఉడుకుమోత్తనంతో.

"అక్కయ్యను నువ్వు అడగలేక పోయావా మరి?!" అన్నాడు ప్రకాశం.

"నాకు భయం నాన్నా! — నే నడిగితే కసురుతుంది."

బాబు తండ్రితో అంటున్న మాటల్ని ప్రక్కగదిలోంచి వింది రవణమ్మ. ఒళ్లు మండిం దామెకు. తనెప్పుడు వాడిని కసిరింది గనక?! — భ్రరున అక్కడికొచ్చింది. "ఔనురా! — నిన్నెప్పుడు కసిరేనురా నేను? — వెధవబద్ధాలూ నువ్వూను!" అంది బాబువేపు కోపంతో చూస్తూ.

"ఏదోనమ్మా చిన్నపిల్లడు! — " అన్నాడు ప్రకాశం.

"ఆఁ! — చిన్నపిల్లడు! — ఇలా అబద్ధాలు చెప్పడంలో మాత్రం పెద్దవాడేలే! నే నెప్పుడూ వాడిని కసరేలే దసలు! — ఎలా చెప్తున్నాడో చూడు. నా కెందుకు వాడూసని ఇంతవరకూ వాడి జోలే వెళ్లలేదు నేను."

"చూడు రవణా! — తల్లి నెరగే ఎరగడు. వాడిని వాత్సల్యంతో చూడమ్మా!"

"నువ్వు మరీ ఇదిగా మాట్లాడుతున్నావు నాన్నా! — ఇప్పుడు నేను వీడి నేమన్నాను గనక?" అని రవణమ్మ అంటూ ఉండగానే నానిగాడు రివ్వున వీధిలోంచి పరిగెట్టుకొచ్చి తాతయ్య ఒళ్లోకి దూరేడు. "ఔరా నానీ! — మరి మామయ్యకు పకోడీలు ఇచ్చేవు కావేం? — నువొక్కడివీ తినేయడం తప్పు కదూ?" అనడిగేడు ప్రకాశం నానిగాడిని.

"వాడి కెందు కివ్వాలీ మరి?! — వాడి కిమ్మనమని అమ్మ చెప్పిం దేమిటి?" అని గొనిగేడు నానిగాడు.

"నే చెప్పకపోతే మాత్రం? — వాడికి కూడా ఇవ్వలేక పోయేవురా?" అనంది రవణమ్మ.

"మరయితే వాడికోసం మరో అణా నే నడిగితే, 'అక్కర్లేదు. వాడికి కనిపించకుండా తినేయ్!' అన్నేదూ నువ్వు?" అనడిగే డమ్మని అమాయకంగా నానిగాడు. అలా అడగడంవల్ల వచ్చే ఫలితాలు నానిగాడి కేం తెలుసు?! —

నానిగాడి చెంపమీద కోపంతో ఛెళ్లున లెంపకాయ కొట్టింది రవణమ్మ!—"అబద్ధాలు కూడా నేర్చేవ్!—నే నలా నీతో అన్నానురా?" అని మరోటి కొట్టింది.

"అయ్యో!—పసివాడినలా ఎందుకు కొడతావమ్మా!" అని అడ్డుకున్నాడు ప్రకాశం.

"అదికాదు నాన్నా, 'నే నొక్కణ్ణే తినేస్తా'నని వాడనుకుంటూ వెళిపోతూ ఉంటే—పని తొందరలో 'నీ ఇష్టం' అని అనేసేను కాబోలు!" అంది రవణమ్మ తన తప్పులేదని సమర్థించుకుంటూ.

—తాము చేసిన తప్పుని అవతలవాళ్లమీద త్రోసేసి తమాషాగా తప్పించుకొనే అంతటి శక్తి నానిగాడి కింకా రాలేదు. అమ్మ కొట్టినందుకు ఏడుపుకి లంకించుకున్నాడు. బాబు బిక్క చచ్చిపోయేడా దృశ్యాన్ని చూసి!—తననీ ఎప్పుడయినా అక్కయ్య అలా కొట్టేస్తుందేమో నని భయంవేసింది బాబుకి. తనవల్లే నానిగాడు దెబ్బలు తిన్నాడేమో అని బాధపడ్డాడు!—

—ప్రకాశం కూడా బాధపడ్డాడు; అలాంటి చిన్నవిషయంలో మనస్పర్థలు బయటపడ్డందుకు!—తనే గుప్‌చప్‌గా ఓ అణా బాబుగాడి చేతులో పెట్టేస్తే ఏతంటా లేకపోయేదిగా!—బాబుగాడి భవిష్యత్తు ఎలా ఉంటుందా అనే బెంగపట్టుకుంది ప్రకాశానికి.

## 5

అవాళ ఓ ఉత్తరం అందుకున్నాడు ప్రకాశం అతను 'రిటైర'యిన స్కూలు హెడ్మాస్టరు దగ్గర్నుంచి. ఆ క్రిందటి నెలజీతం వచ్చినట్టూ, తీసుకొనే అందుకు వస్తారా, లేక మనియార్డరు చేసేయమంటారా అని.

తను ఎలానూ వెళ్ళాలనుకున్నాడు ప్రకాశం. సామాను చాలావరకూ అక్కడే ఉండిపోయింది. పైగా ఆ అద్దెఇల్లు ఖాళీచేసేయాలి. తను ఎలా అయినా వెళ్ళవలసే అవసరం ఉంది. కానీ అతని కొక్కటే సమస్య ఎదురయింది!—బాబుని కూడా తోడ్చుకొని వెళ్లడమా లేక తనొక్కడూ వెళ్ళడమా అని. చిన్నప్పటినుంచీ తనను విడిచిపెట్టి ఒక్కనాడూ ఉండలేదు బాబు!—మరి విడిచిపెట్టెళితే బెంగపెట్టుకోడూ?—రవణమ్మ వాడిని సరిగ్గా చూస్తుందనే నమ్మకం ఏమిటి మహా!—

చెప్పేడు కూతురితో—"నే నూరికి వెళ్లాలి. అక్కడి ఇల్లు మొదట కాళీచేసి సామాను తీసుకొని రావడం, క్రిందటినెల పనిచేసినంతవరకూ నాకు రావలసిన జీతం పుచ్చుకోడం, ప్రోవిడెంటు ఫండు త్వరగా వచ్చే అందుకై తగు ఏర్పాట్లు చెయ్యడం చెయ్యాలి. ఇప్పటికే ఆలస్యమయిపోయింది."

"సరే!—వెళ్లిరా నాన్నా!—నీ కెంత డబ్బు కావాలో చెప్పు. ఇస్తా!" అంది కూతురు.

"డబ్బు మాటకేంగానీ, బాబుగా డొక్కడూ ఇక్కడుండగలడా అని నా అనుమానం. వాడినీ నాతోపాటు తీసుకెళదా మనుకుంటున్నాను." అన్నాడు.

"బాగు బాగు!—అయితే ఇక్కడ నేనేమయినట్టు?—వా డొక్కడూ ఉండవలసిన ఖర్మమేం?—అయినా బాబుగాడి విషయంలో మొదటినుంచీ నువ్వు నన్ననుమానిస్తూనే ఉన్నావు!—ఇంతకీ బాబుగాడు నాకేం ద్రోహం చెయ్యలేదు. వాడివల్ల తప్పు రవ్వంతయినా లేదు. ఓ రకంగా ఆలోచిస్తే వయస్సు దాటిన తరువాత పిల్లల్ని ఎలా పోషిస్తానయినా ఆలోచించకుండా మళ్లీ పెళ్లిచేసుకోడం నీతప్పు!—అంతే కానీ వాడిదికాదు. అప్పట్లో నీమీద కోపం ఒచ్చిన మాట వాస్తవం!—కానీ ఆకోపం ఇప్పుడు తగ్గిపోయింది. నీకేం భయంలేదు నాన్నా!—వాడిని నేను జాగ్రత్తగా చూస్తాను. నువ్వెళ్లు. ఇవాళంటే నువ్వు బ్రతికున్నావు. ఇకముందు నేనేగా వాడికి దిక్కు!—అంచేత మరేం ఫరవాలేదు. నాలుగు రోజులపాటు వాడు నా దగ్గర నువ్వు లేకుండా ఉంటే క్రమేపీ చనువేర్పడుతుంది. ఇప్పుడెంచేతో వాడు నన్ను చూసి భయపడుతున్నాడు." అంది రవణమ్మ.

ప్రకాశం మరేం మాట్లాడలేకపోయేడు. బాగా ఆలోచించేడు. తనొక్కడూ వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు.

ఆ సాయంత్రం కొడుకునీ, మనవడినీ బజారుకి తీసుకెళ్ళి మిఠాయి కొనిచ్చేడిద్దరికీ. బాబు మిఠాయి తింటూ ఉన్నప్పుడు చెప్పేడు—"చూడు నాయినా! నే నూరుకెళ్ళి రేపే వచ్చేస్తాను. మరేం భయపడకు. అక్కయ్య నీ క్కావలసినవన్నీ ఇస్తుందిలే!" అని.'

"ఊహూఁ!—నేనూ వస్తాను. నా కిక్కడ భయం!" అని గునిసేడు.

"మరి చూడూ నాతో వచ్చేస్తే రేపు బడిలో పాఠాలు పోవూ?—మేష్టారు కోంబడతారు. చక్కా

నానిగాడున్నాడు; నీకు భయమేంటి చెప్పు?'—అదీ కాక సినీమాకెళ్లడానికి డబ్బులిస్తాను, చక్కా ఇద్దరూ చూద్దురు గాని. మనింటిదగ్గరే హాలుకూడాను." అని ఓ రెండురూపాయలు తీసి చెరొకటి చొప్పున ఇద్దరికీ ఇచ్చేడు ప్రకాశం.

సినీమా కెళతాం కదా అనే సంతోషంలో ఒప్పేసుకున్నాడు తండ్రి ప్రయాణానికి.

"నువ్వు తప్పకుండా రేపొచ్చేస్తావు కదూ?" అ నడిగేడు బాబు.

"ఓ తప్పకుండా!" అన్నాడు ప్రకాశం. తిరిగొచ్చేసరికి ఓ వారం రోజులవుతుందని, అంటే ఒప్పుకోడు కదా అని అబద్ధం ఆడేసేడు. ఆ రాత్రి ట్రైనుకే ప్రయాణమయేడు ప్రకాశం.

## 6

ఆ మర్నాడు బాబుకి పూర్తిగా మతిపోయి నట్లయింది. తన నేదో మహా ప్రమాదకరమయిన ప్రదేశంలో ఉంచేసి తండ్రి వెళిపోయినట్లు ఫీలయేడు. బెంగతో అతి కష్టంమీద ఆరోజు గడిపేసేడు.

ఆ మర్నాడు బడిలో నానిగాడిని అడిగేడు. "మా నాన్న ఇంకా రాలేదేం?—నిన్నటికే వచ్చేస్తానన్నాడు కదా!" అని!

"ఏమో నాకేం తెలుసు!—అయినా ఎందుకురా ఆ బెంగ?!—మా నాన్న ఇప్పటివరకూ రాకపోయినా నే భయపడు తున్నానేంటి?!" అని నానిగాడి సమాధానం.

"మీ నాన్నెప్పుడూ రాడు మరి!—చచ్చిపోయిన వాళ్ళు మరి రారని మా నాన్న చెప్పేడు!" అన్నాడు బాబు.

"నిజమే నేంటిరా?!—అయితే మరి మా నాన్న రాడూ?"

"ఊహుం!—"

"పోనీలే!—మా అమ్మ ఉంటూ ఉండగా నాకు భయమేంటి?" అన్నాడు నాని.

"నా కసలు అమ్మ లే నేలేదు!"

"అసలు ఎప్పుడూ లేదన్న మాట!"

"లేదు. నా కొక్క నాన్నే ఉన్నారు. ఆ నాన్నిప్పు డింకా రాలేదు చూడు!"

"మా నాన్నలా, చచ్చిపోయేరేంటో!—లేకపోతే నిన్న రాత్రికే ఒచ్చేసుండేవాడు." అన్నాడు నాని.

బొంబుగుండెల్లో రాయిపడింది. "నిజమే అంటావా?—" అని కళ్లంట నీళ్లు కార్చేడు బాబు. బెంగపట్టుకుంది బాబుకి.

"తాతయ్య చచ్చిపోయినా, కఱ్ఱలమీద కట్టి ఇక్కడికే ఎవళ్లయినా తీసుకొస్తారులే!—భయంలేదేడవకు. అయినా మా అమ్మ ఉంటూ ఉండగా నీకు భయమేంటిరా!" అని నానిగాడు అంటూఉండగా నే బెల్లు మ్రోగింది!—అంతా క్లాసుల్లోకి వెళిపోయేరు.

బాబు మరేం మాట్లాడలేదు. ఆ లేత హృదయం బెంగతో నిండిపోయింది. ఈ ప్రపంచంలోకల్లా నాన్నొక్కడే మంచివాడని బాబు నమ్మకం. అలాంటి నాన్న లేకపోతే తన గతేం కానని బాబు భయం.

క్లాసులో మేష్టరు లెక్కలు చెపుతున్నాడు. బాబు పరధ్యాహ్నంగా వింటున్నాడు.

"రెండూ, మూడూ కలిపితే ఎంతరా?" అని చటుక్కున మేష్టరు బాబు నడిగేడు.

"ఆరు!" అన్నాడు బాబు. ఛడేలున లెంప మీద కొట్టేడు మేష్టరు.

బావురుమన్నాడు బాబు!—ఆ ప్రక్కనే ఉన్న నానిగాడి నడిగేడు మేష్టరు. "అయిదు." అని సమాధాన మిచ్చేడు నానిగాడు. బాబుని తెగతిట్టి, నానిగాడిని మెచ్చుకున్నాడు మేష్టరు.

బాబు తెగ ఏడిచేడు. ఆ ప్రశ్న సరిగ్గా వింటే సరయిన సమాధానం చెప్పేసేవాడే!

ఇంటికొచ్చేక నానిగాడు అమ్మతో చెప్పేడు బళ్లో జరిగిన సంగతంతా.

"ఓరి బడ్డూ!—రెండూ, మూడూ కలిపితే ఎంతవుతుందో తెలీదూ?" అని గట్టిగా రవణమ్మ అడిగింది బాబుని.

బాబు బిక్కచచ్చిపోయేడు. మరేం మాట్లాడలేదు. ఇక అక్కయ్యకూడా తంతుందేమో అని భయపడ్డాడు. నాన్నే ఉంటే? — అలా ఎవరయినా తన నంటే ఊరుకుంటాడూ, అనుకున్నాడు.

"పోనీ, ఏడూ, ఎనిమిదీ కలిపితే ఎంత?" అనడిగింది రవణమ్మ.

"పదిహేను." అని బాబు సమాధానం.

"ఇది చెప్పగలిగేవాడివి ఆమాత్రం చిన్న ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయేవురా?"

"నే సరిగ్గా వినలేదు." అని గొణిగేడు.

"సరిగ్గా ప్రశ్న వినకపోడం నీతప్పే?—అతూరి బడనుకున్నావేమిటి?—కోదండం ప్రేలకట్టి డొక్క

చీల్చేస్తారిక్కడి మేష్టర్లు!—సరేగానీ, తిండికి పద!" అని వంటింట్లోకి వెళిపోయింది రవణమ్మ.

అంతా మహాభయంకరంగా కనిపించింది వాతావరణం బాబుకి. అక్కయ్య ఓ పెనుభూతంలా అగుపించింది!

అవాళ అన్నందగ్గర బాబు కూర్చున్నాడన్న మాటేగానీ ఒక్క మెతుకూ నోట్లో వేసుకోలేదు బాబు.

"ఏంరా అలా తింటున్నావేం?" అనడిగింది అక్కయ్య.

"నాన్న......" అని గొణిగేడు. కళ్లంట అప్రయత్నంగా నీళ్ళు కారేయి బాబుకి.

"మొదట అన్నం తిను!—నా న్నొస్తాడులే. నీపీక నే నిప్పుడేం తీసేను." అంది రవణమ్మ కటువుగా.

బాబు తినబోయేడు. కానీ ఆనోట్లో వేసుకున్న రెండు మెతుకులూ వాంతిద్వారా బయటకొచ్చేసేయి!

"ఛీ! — అపసంతి వెధవా!" అని చీదరించుకుంటూ అంది రవణమ్మ.

చెయ్యి కడుక్కున్నాడు బాబు. ఒంటిమీద తెలివంతగా లేదు. గదిలో ఓమూలకెళ్లి కూలబడ్డాడు.

మధ్యాహ్నం బడివేళ అయింది. "ఏరా మొద్దు వెధవా!—ఏమిటా నిద్ర బడివేళయింది." అని బాబు భుజంమీద తట్టి లేపింది రవణమ్మ. బాబుశరీరం వేడిగా తగిలింది. మళ్లీముట్టుకొంది, కాలిపోతున్నాది శరీరం!-"ఏరా!—ఒళ్లు వేడిగా ఉందేం?" అనడిగింది.

"తలనొప్పి!" అని మూలిగేడు బాబు. మరోమారు శరీరాన్ని తాకింది. మరిగిపోతున్నాది శరీరం. ఆయాసంతో మూల్గుతున్నాడు బాబు!—

"చూడు బాబూ! — తలనొప్పి ఎక్కువగా ఉందా?" అని ఆప్యాయంగా అడిగింది.

అంత మంచిగా అక్కయ్య అడుగుతుందనుకోలేదు బాబు, "ఊ!" అనిమాత్రం అన్నాడు—"మరేం భయంలేదు నాయనా! అదే తగ్గిపోతుంది," అని, పందిరిమంచంమీద ప్రక్కదులిపి, బాబునెత్తుకొని అందిమీద పడుకోబెట్టింది. అక్కయ్య అంత సదుపాయం చేస్తుందనుకోలేదు బాబు.

"నాన్నింకా రాలేదూ?!" అని మూలిగేడు బాబు.

"ఒస్తారు నాయినా! — నువ్వు పడుకో. ఈలోగా నీ క్కావలసినన్ని పళ్ళు తెప్పిస్తాను." అంది.

బాబు ప్రక్కకొత్తిగిల్లేడు—

— అమాయకంగా జ్వరంతో పడుక్కున్న బాబువేపు చూసింది. అదేమంచంమీద తనభర్తకూడా జబ్బుతో ఉన్నన్నాళ్ళూ పడుక్కున్న సంగతామెకు జ్ఞాపకానికొచ్చింది. ఆ మంచంమీంచే దించేసేరు. ఆ విషయం జ్ఞాపకానికొచ్చేసరికి భయంకరమయిన అనుమానం కలిగిందామెకు! — కొంపతీసి బాబు చచ్చిపోడుకదా అని!!—బాబప్పట్లో చచ్చిపోతే తనెంతటి అపనిందకు అనవసరంగా గురవుతుందో ఊహించలేక పోయింది. తనే ఏదో మందిచ్చి చంపేసుంటుందని తండ్రి అనుమానించడూ? — లోకులుకూడా అలానే తీర్మానించరూ? — తనకూ బాబుకూ ఉన్న సంబంధం ఆరకమయిన అనుమానానికి అవకాశమివ్వడంలో అసహజముంటుందా? .— అనవసరమయిన నిందకు తను గురి కావలిసిందేనా?—

—అసలలాంటి నిందే ఒకవేళవస్తే అది అసందర్భమయిన నిందవుతుందా అనే అనుమానం కలిగిందామెకు. ఆరోగ్యంగా ఉన్న బాబు కవాళ ఆజ్వరం రావడానికి కారణం? — బాబుపట్ల తన ప్రవర్తనే ఏమో!—అసలు బాబా ఇంటిలో కాలుపెట్టినదగ్గర నుంచీ, వాడినోరకమయిన ఈర్ష్యాభావంతో చూస్తూ ఉందేకానీ, దగ్గరకు చేరదీసి లాలించలేదు. వాత్సల్యంతో చూడలేదు! — పైగా తనభర్త పోయేడనే దుఃఖంలో, ఏడుస్తూ వాడిముందు ప్రత్యక్షమయిందే కానీ, చిరునవ్వుతో వాడిని చేరదియ్యలేదు. మాతృత్వపు ప్రేమపాశాల మధ్యనుండే వాత్సల్య మాధుర్యాన్ని రుచిచూడని బాబుకి తన ప్రవర్తనవల్ల స్త్రీఅంటే ఓ భయంకరమయినమనిషనే భావం ఏర్పడ్డంలో అసహజం లేదేమో ననుకుంది. చిన్నప్పటినుంచీ నాన్నదగ్గర పెరిగేడు. నాన్న నెప్పుడూ విడిచిపెట్టుండలేదు! — అసలే నాన్నింకా ఊరునుంచి రాలేదనే బెంగతో ఉన్న బాబుని మేష్టరు కొట్టేడు. పైగా ఇంటికొచ్చేక తను తిట్టింది!—ఇక చిన్నవయస్సులో ఉన్న బాబు బెంగపెట్టుకొని జ్వరం తెచ్చుకోడంలో ఆశ్చర్యం ఉందా?—ఆ పరిస్థితిలో తను వాత్సల్యంతో చూచున్నట్లయితే బాబా జ్వరానికి గురయుండేవాడా అనుకుంది.

— తనకు వాడు సవతితల్లికొడుకయిన మాట నిజమే!—సవతితల్లి తన నేరకంగానూ బాధించలేదు. అసలామెను తను చూడనేలేదు. పిల్లడ్నికని చచ్చిపోయింది!—కుళ్ళూ కపటంలేని ఆ అమాయక పిల్లడిమీద తన కీర్ష్యెందుకూ? అర్థంలేని ఈర్ష్య!—తనతో పాటే తనతండ్రి రక్తాన్ని పంచుకున్నాడు. ఏమైనా

వాడు తనకు తమ్ముడే!—వాడి ప్రాణా లెలా అయినా కాపాడాలనుకుంది.

ఆసాయంత్రం డాక్టరికి కబురంపించింది. డాక్టరొచ్చేడు.

"గుండెకాయ కొన్నాళ్ళయి చెడినట్లుంది. దానిమీద ఏదో విపరీతమయిన భీతి కలగడంవల్ల ఈ జబ్బొచ్చింది." అన్నాడు డాక్టరు బాబు శరీరాన్ని పరీక్ష చేసినతరువాత.

"మీ రెలా అయినా రక్షించాలి బాబూ!—మీ రెంత బిల్లుచేస్తే అంతా ఇచ్చుకుంటాను." అన్నాది రవణమ్మ ఆందోళనతో.

"ప్రయత్నిస్తాను." అని డాక్టరు అని, ఓ ఇంజెక్షన్ ఇచ్చి—"నిద్ర బాగా పట్టేస్తుంది. గడి గడికీ పిలవకండి!—నిద్ర లేచేక ఓ కప్పు కాఫీ ఇవ్వండి. ఆ తరవాత మందు కెవరినయినా పంపించండ'ని చెప్పి ఫీజు పుచ్చుకొని వెళ్ళిపోయేడు.

రవణమ్మలో ఆందోళన బయలుదేరింది!—కొంపతీసి బాబు చచ్చిపోతే! తండ్రి తనింట్లో ఇకుంటాడా?—లోకులు తనమీద నింద మోపకుండా వుంటారా?—కనీసం తండ్రి ఒచ్చే అంతవరకూ అయినా బ్రతికుంటే బాధలేదు. ఈలోగా బాబుకి సేవచేసి 'అక్కయ్య మంచిదే' అనే అభిప్రాయం కలుగజేయొచ్చు. వాడు తండ్రితో తనగురించి మంచిగా చెప్పి చచ్చిపోయినా బాధ లేదనుకుంది!—ఇంతకీ బాబు ఆమాత్రం జ్వరానికే చచ్చిపోతాడని ఎందు కనుకోవాలి?—ఏమయినాసరే వాడు చచ్చిపోడానికి వీల్లేదు. తనకు తమ్ముడొకడుండాలి!—అందుకోసం వాడు బ్రతికి ఆరోగ్యంగా ఉండాలని ఎందు కనుకోకూడ దనుకుంది.

ఎందుకయినా మంచిది; తండ్రికి వైరిస్తేనో!—ఇంతకీ తన పిచ్చిగానీ, ఏదో మామూలుగా జర్వం వచ్చినంత మాత్రంలో తనకా కంగారెందుకు?—ఎంతమందికి జ్వరా లొచ్చిపోలేదు?!—కానీ డాక్టరు "ప్రయత్నిస్తా న"న్నాడే గానీ "ఫరవా లేద"నలేదే!—అలా అంటేనే గానీ ఎక్కువ డబ్బు ముట్టదనే ఉద్దేశ్యంతో అన్నాడేమో నని సమాధానపడింది'—

అవాళ తండ్రితగ్గర్నుంచో లేఖ వచ్చింది రవణమ్మకు. ఇంకా అక్కడి పనులు పూర్తికాలేనట్టూ, వచ్చేసరి కింకా ఓ మూడురోజులపైని పట్టొచ్చనీ; బాబుని వాత్సల్యంతో చూడమనీను!—

ఉత్తరం చదవడం పూర్తయేసరికి—"అక్కయ్యా!—నాన్నిం...కా రాలేదూ? చచ్చిపోలేదు...క...దా?!" అ నడిగేడు మెల్లగా.

అప్రయత్నంగా కన్నీరు కార్చింది రవణమ్మ. "ఒస్తారు నాయినా!—మధ్యాహ్నం రైలులో వస్తారు. నువ్వు చాలా మంచివాడివి. ఈ మందు త్రాగేయి బాబూ! నీకు మంచి బిస్కత్తు లిస్తా!" అని మందు నోట్లో పోసింది. గుటుక్కున మింగేసేడు బాబు.

మందు త్రాగేసేక బాబుకి మగత క్రమ్మినట్లయింది!—ప్రక్క కొత్తిగిల్లేడు.

బాబు బ్రతకాలని దేముళ్ళందరికీ నమస్కారాలు పెట్టింది రవణమ్మ. తీరా తనకి వాడిమీద వాత్సల్యం జనించే టప్పటికి దక్కకుండా పోతాడేమోనని ఆమె బెంగ!

## 7

తండ్రికి వైరుచేసిం దవాళ రవణమ్మ!—

ప్రకాశం గదలోకి కాలుపెడుతూ ఉండగానే—"నా...న్న...అ...క్క...య్య..." అని గొణిగేడు బాబు.

"వచ్చేను నా...యి...నా" అన్నాడు ప్రకాశం బాబు నుదురుమీద ఆందోళనతో చెయ్యివేస్తూ.

బాబు మరి తండ్రిని చూడలేకపోయేడు! ఆగిపోయిందా పసిహృదయం!!—

"అనుకున్నంత పనీ...అయిం...ద"ని బావురుమన్నాడు ప్రకాశం.

తండ్రిఏడుపుతో శ్రుతి కలిపింది రవణమ్మ!—ఆమె ఏడుపు చాలా అసహ్యంగా వినిపించింది ప్రకాశానికి!—

శవాన్ని తీసుకెళ్ళిపోయేరు.

"తప్పంతా నాది. ఈ బాధకోసమే రెండోపెళ్లి చేసుకున్నాను. ఒకళ్లమీద నిందేసేం ప్రయోజనం?" అని తనలో తాననుకున్నాడు ప్రకాశం.

## 8

ఆ మర్నాడుదయం తండ్రికోసం ఇల్లంతా వెదికింది రవణమ్మ!—గట్టిగా పిలిచింది "నాన్నా" అని!—ప్రత్యుత్తరం పొందలేకపోయింది!—

ఆరోజల్లా నిరీక్షించింది తండ్రికోసం!—మరి రాడని ఆతరవాత తెలుసుకుంది.

కేవలం తుదివరకూ బాబుమీద ఈర్ష్య అసూయలతో నేఉండి, వాడు చస్తేనే చాలనేదృక్పథంలో రవణమ్మ ఉండినట్టయితే లోకులు వేసిన నిందకు అంతగా బాధపడుండేదికాదు!!!—